# జీవనసూత్రం

"వచ్చే నెలలోనే మీ బర్త్‌డే. ఇది యాభయ్యవది గనుక గ్రాండ్‌గా చేద్దామండీ"

భార్య మాటలకు 'బిజినెస్ కాలమ్' లోంచి తలెత్తి చూశాడు పాంచజన్యం.

" అరె ! నిజమే సుమా. నాకప్పుడే యాభయ్యేళ్ళు వచ్చేశాయా ! "

" రాక ?! మీరింకా బాలాకుమారుడ్ననుకుంటున్నారా ఏమిటి ! " మురిపెంగా నవ్వింది మంజుల.

" ఇదివరకు మా పల్లెలో యాభయ్యేళ్ళకే బాగా చిక్కిపోయి, తల నెరిసి పోయి, దగ్గుల్తో సతమతమవుతూ ఎంతో ముసలివారుగా కన్పించేవారు తెలుసా ?! "

" కాలం మారిపోయింది స్వామీ. అరవై ఏళ్ళ వయస్సులో నాగేశ్వరరావు హీరోగా వెయ్యలేదూ !"

" అక్కడక్కడా ఒకటీ అరా తెల్ల వెంట్రుకలున్నాయి గాని యాభైఏళ్ళవాడిలా లేనే లేను. ఫిఫ్టీ ఇయర్స్ అంటే సంపూర్ణ వయస్సులో సగం మైలురాయి దాటేసినట్టే ! " నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ అన్నాడు.

"ఆనందంగా ఆరోగ్యంగా ఉండే వారి మొహంలో ముసలి ఛాయలు కన్పించవు "

" అదీ పాయింటే. నేను హ్యాపీ పెర్సన్ని. ఈ సారి కంపెనీ టర్నోవర్ ముప్ఫైకోట్లు దాటిందా హ్యాపియస్ట్ పెర్సన్ని అయిపోతాను. ఇక మన స్టేట్‌లో, మన ప్రోడక్ట్స్‌లో నన్ను కొట్టేవారుండరు "

" తప్పకుండా మీరనుకున్నది సాధిస్తారు. మీ శ్రమ కృషి పట్టుదల అమోఘం. వీటన్నిటీ్నీ మించి చక్కని ప్లానింగ్, ఎంచక్కని మార్కెటింగ్ స్ట్రాటజీ మీ సొంతం " అభినందన పూర్వకంగా చూస్తూ అంది.

సంబరంగా తలూపి మరింతగా సంబరపడ్డాడు.

" బర్త్‌డేని ఎలా సెలబ్రేట్ చేద్దామంటారు ? "

" గ్రాండ్‌గా చేద్దామన్నావుగా. ఓకే. ఇక ఎలా అన్నది నీ ఇష్టం. చాలా గొప్పగా ఉండాలి. మన స్టేటస్ తెలియజెప్పేట్లుండాలి..."

" క్లబ్‌ఫ్రెండ్స్‌కీ బిజినెస్ లింక్స్‌కీ ప్రతి ఏటా పార్టీ ఇస్తున్నారుగా. ఈ సారి వెరైటీగా బంధుమిత్రుల్నీ ముఖ్యంగా మీ చిన్ననాటి నుంచీ వున్న ఫ్రెండ్సందర్నీ పిలిచి హోటల్లో ఘనంగా పార్టీ ఇద్దాం..."

చప్పరించేశాడు పాంచజన్యం

" వాళ్ళెవళ్ళూ మన స్థాయికి తగరు. పిలిస్తే చాలు తోక ఊపుకుంటూ చొంగ కార్చుకుంటూ వస్తారు తప్ప వాళ్ళ వల్ల ప్రయోజనం ఏమీ వుండదు..."

" ఇది బర్త్‌డే పార్టీ అండీ బిజినెస్ పార్టీ కాదు.." భర్త ధోరణికి విస్తుబోతూ అంది.

" దేనికైనా ఓ పరమార్థం ఉండాలిగా. నా ఫ్రెండ్సంతా బడి పంతుళ్ళూ, బ్యాంకు గుమస్తాలూ, కంప్యూటర్ ఆపరేటర్లూనూ ! థర్డ్‌రేట్ ఫెలోస్ ! "

" అయినా ఫ్రెండ్స్ ఫ్రెండ్సే కదా. ఆ పీతాంబరం మీకు క్లోజేమో ? "

" వాడో ఫెవికాల్ వెధవ ! వాడు పీతాంబరం కాదు నీతాంబరం. నీతి కబుర్లు చెప్పడంలో పోటీ పెడితే ఫస్ట్ ప్రయిజ్ వాడిదే. వాడు కన్పిస్తేచాలు ' ఎదుటి వాడికి చెప్పేటందుకే నీతులు వున్నాయి' అని పాడాలన్పిస్తుంది "

" సన్నకారు రైతు బిడ్డ అయిన మీరు కోట్లకి పడగెత్తారని కొంచెం అసూయగా ఉంటుందిలెండి "

" ఏడ్చే వాళ్ళని ఏడ్వనీ గానీ బాగా ఆలోచించు అంతా గుమ్మయ్యేలా ప్లాన్ చేద్దాం "

బ్రేక్‌ఫాస్ట్ చేస్తోంటే స్కూలు కెళ్ళడానికి తయారై వచ్చారు బంటీ బబ్లీ. అప్పుడే విచ్చుకున్న మొగ్గల్లా వున్నారిద్దరూ.

" హాయ్ డాడ్ "

" హాయ్. ఆ డిబ్బీలేమిటి బంటీ " వారి చేతుల్లోని డిబ్బీల్ని చూస్తూ కించిత్తు విసుగ్గా అడిగాడు.

" హెల్ప్ ది బ్లయిండ్ కేంపయిన్ డాడ్. మీరూ వెయ్యాలి..." డిబ్బీని పైకీ క్రిందికీ ఆడిస్తూ అన్నాడు.

" నాకెక్కువ వెయ్యాలి " గారాలు పోయింది బబ్లీ.

అయిష్టంగా మొఖం పెట్టి అన్నాడు " మీరు కోటీశ్వరుల చిల్డ్రన్. మీకిలా బెగ్ చెయ్యాల్సిన ఖర్మేమిటి. డ్రాప్ ది బాక్సెస్ ..."

పిల్లలిద్దరూ చిత్రంగా చూశారు. పిమ్మట మొఖామొఖాలు చూసుకున్నారు.

" దిసీజ్ నాట్ బెగ్గింగ్ డాడ్. హెల్పింగ్ ది డిజేబుల్డ్........" అని బంటీ అంటే, " మానవ సేవే మాధవ సేవ అని చెప్పేరు టీచర్ " అంది బబ్లీ.

వారి మాటలకు మురిసిపోయి ముద్దు పెట్టుకుంది మంజుల. " నా బిడ్డలు రత్నమాణిక్యాలు గాని త్వరగా వెయ్యండి స్కూలు కెళ్తారు " పర్సు అందించింది మంజుల.

చెరో వందా వేశాడు పాంచజన్యం.

" థాంక్యూ డాడ్ ..." ముక్తసరిగా చెప్పారు.

"అంత కూల్‌గా చెబుతారేంట్రా, డాడీ గ్రేట్ అనండి " నవ్వుతూ అంది తల్లి.

" ఇంకొకరు టూ హండ్రెడ్ వేశారు మామ్ " అంటూ వెళ్ళిపోయారు.

" బై.... జాగ్రత్త .... డ్రైవర్ వచ్చేడు కదా....." పాంచజన్యం ఆరా తీశాడు.

" ఎప్పుడో వచ్చేడు. రంగా డ్యూటీలో అశ్రద్ధ చెయ్యడు "

వినీ విననట్లుండి పోయాడు.

కంపెనీకి వెళ్ళగానే - " ఇవాళ చాలా ఉత్సాహంగా వున్నారు. కొత్త ఆర్డర్స్ కన్ఫర్మ్ అయ్యాయా సార్ " పిఏ సుధీర అడిగింది.

" అయామ్ గోయింగ్ టు క్రాస్ ఫిఫ్టీ ఇయర్స్ బై నెక్స్ట్ మంత్ "

" ఓ రియల్లీ ? ఎడ్వాన్స్ కంగ్రాట్యులేషన్స్ సార్. మాకు పెద్ద పార్టీ ఇవ్వాలి "

"నా వైఫూ అదే అంటోంది. ఎలా సెలబ్రేట్ చేస్తే స్పెషల్‌గా వుంటుం దంటావ్ ?"

" మన కంపెనీలో యాభై ఏళ్ళు పైబడినవారు ఇరవై మంది వరకూ వుంటార్సార్. ఆ దంపతుల్ని సన్మానించొచ్చు. స్పెషల్ బోనస్ ఇవ్వొచ్చు. బాగా పనిచేసే వారికి అవార్డులివ్వొచ్చు. వారి పిల్లలకు బుక్సూ ఫీజులూ...."

పెదవి విరిచేశాడు పాంచజన్యం.

" వర్కర్స్ వెల్ఫేర్ క్రింద ఏవేవో చేస్తూనే వున్నాం కదా. మళ్ళీ ఎందుకూ శుద్ధ దండగ ! అయినా మనం జీతాలు బాగానే ఇస్తున్నాంగా. కొత్త బెనిఫిట్స్ ఒకసారిస్తే చాలు ప్రతీసారీ ఇమ్మంటూ పీక పట్టుకుంటారు యూనియన్ వాళ్ళు...."

" ఇంకెలా చేద్దామంటార్సార్. కొంచెం క్లూ ఇస్తే..."

" ఏదైనా వినూత్నంగా న్యూస్ అయ్యేట్టుగా వుండేదైతే బావుంటుంది "

" మీరు జీనియస్సు. మీ ఐడియా చెప్పండి సార్...."

" రెలటివ్స్‌నీ, ఫ్రెండ్స్‌నీ, వర్కర్స్‌నీ అందర్నీ పిలిచి భారీగా పార్టీ ఇస్తూ ఎవరైనా సెలబ్రిటీని గెస్ట్‌గా పిలిస్తే... ఐ మీన్ సినిమా యాక్టర్లనో క్రికెటర్లనో పిలిస్తే న్యూస్ కవరేజ్ వస్తుంది. కంపెనీకి మంచి పబ్లిసిటీ అవుతుంది..."

ఆమె మాట్లాడలేదు. అదోలా చూసిందంతే.

" ఇంకా చాలా టైముందిలే. ఈ లోగా జీవితాన్ని మార్చేసే ఐడియా వస్తుందేమో చూద్దాం " నవ్వేడు.

" మీరు గ్రేట్ సార్. మీరేం చేసినా గ్రేటే. రికార్డే " అభినందించి వెళ్ళిపోయింది.

టేబుల్ మీది ఫైల్స్‌లోకి చూశాడు గాని దృష్టి అంకెల మీద నిలవట్లేదు.

ఫ్లాష్‌లా వెలిగిందో ఐడియా

సినిమా యాక్టర్ల చేత రికార్డింగ్ డాన్స్ చేయిస్తే ?

పది లక్షలు ఖర్చు అయినా బిజినెస్ సర్కిల్లో తన ఇమేజ్ పెరుగుతుంది. అన్ని ఛానల్స్ వాళ్ళూ, పత్రికల వాళ్ళూ మిస్సవకుండా వచ్చి కవర్ చేస్తారు.

బంధుమిత్రులు అదో గొప్పవేడుకగా చెప్పుకోవడమే గాక ఎన్నటికీ మర్చిపోలేరు.

పీఆర్వోని పిలిచాడు.

బాస్ బర్త్‌డే ఫంక్షన్ అని తెలీగానే అవాళే బర్త్‌డే అయినట్టుగా అభినందించాడు. పొగిడాడు. సినిమాతారల ప్రోగ్రాం అనే సరికి ఎంతో ఎక్సైటింగా ఫీలయ్యాడు.

" గ్రేట్ ఐడియా సార్. ఇలాంటి గొప్ప ఐడియాలు మీకే వస్తాయి సార్. మీరేవిటో, మీ స్థాయి ఏవిటో, మీ స్టామినా ఏవిటో పబ్లిక్కి తెలియాలి సార్. అందుకు దీన్నో ఛాలెంజింగా భావించి ఆదిరిపోయే లెవెల్లో చేద్దాం సార్ " హనుమంతుడిలా రెచ్చిపోయాడు పీఆర్వో.

" మొత్తం ఎంత ఖర్చవ్వొచ్చో అంచనాలు తయారు చెయ్యి. సినీఫీల్డ్‌లోని ఎవరెవరు రావచ్చో నీ కాంటాక్ట్స్ ఉపయోగించి తెలుసుకో..."

" అంటించారు కదా ఇక ఎలా దూసుకుపోతానో మీరే చూడండి సార్. ఈ క్షణం నుంచి ఆ పని మీదే వుంటాన్సార్...."

అతడెళ్ళిపోయాడు.

పాంచజన్యానికి సీట్లో కూర్చోబుద్ధి కాలేదు. ఫ్యాక్టరీలో కెళ్ళి అన్ని విభాగాలూ చుట్టి వచ్చాడు.

కేవలం లక్షరూపాయల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాడు.

కంపెనీల చుట్టూ తిరిగి చిన్న చిన్న ఆర్డర్లు సంపాదించి, తక్కువ రేట్లకి వేరే చోట్ల ఎగ్జిక్యూట్ చేయించి సప్లై చేసేవాడు. తర్వాత ముఖ్యమైన మెషీన్లుకొని తనే తయారు చేయడం మొదలెట్టాడు.

కాంపిటీటివ్ రేట్లకి చేసివ్వడం, చెప్పిన టైముకి సరుకు అందివ్వటం, క్వాలిటీ మెయిన్‌టెయిన్ చెయ్యడం తనకి ఎస్సెట్స్ అయ్యాయి.

ఆర్డర్లు పెరిగాయి. అంచెలంచెలుగా ఎదిగాడు. స్వంతంగా ఫ్యాక్టరీని స్థాపించాడు. మార్కెటింగ్‌లో కొత్తదారి తొక్కాడు. డిస్ట్రిబ్యూటర్లని ఏజెంట్లని రాష్ట్రంలోనే గాక పొరుగు రాష్ట్రాల్లో కూడా నియమించాడు.

వార్షిక టర్నోవర్ ముప్పైకోట్లకి తీసుకెళ్ళాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తమ పారిశ్రామిక వేత్తల్లో ఒకడిగా కీర్తింపబడ్డాడు. అయినా అలుపనేది లేకుండా ఇంకా ఇంకా

వృద్ధి చెయ్యడానికి అనుక్షణం శ్రమిస్తున్నాడు.

ఇదంతా తను ఒక్కడే సాధించాడు. ఒంటి చేత్తో సాధించాడు ! ఈ వ్యాపార సామ్రాజ్యపు నిర్మాతా, అధినేతా సర్వస్వమూ తనొక్కడే ! యస్. తను ఒకే ఒక్కడు. ఒన్ ద గ్రేట్ !

అతడి భుజాలు ఉప్పొంగాయి.

క్లబ్‌కెళ్ళాడు.

డ్రింక్ సిప్ చేస్తూ బర్త్‌డే ప్రోగ్రాం గురించి సహచరులకి చిన్నగా చెప్పేడు.

" నువ్వెలాగైనా యునీక్ " అభినందించారు.

ఒక సినీనటి పేరు చెప్పి " ఆమెని పిలు. ఆమె ఒంపు సొంపులు తలచుకుంటే చాలు ఒంట్లోంచి ఆవిర్లొస్తాయి గురూ " అన్నారొకరు.

" ఆమెతో కలిసి సరదాగా డాన్స్ చేసే అవకాశం మాకు కల్పించవోయ్ " అన్నారింకొకరు.

మందహాసం చేస్తూ తలాడించాడు " మన గ్రూప్‌కే ప్రయారిటీ ప్రివిలేజూ !"

తర్వాత సినీనటుల ప్రైవేటు జీవితాల గురించి పోచికోలు కబుర్ల మడుగులో దొర్లారు. పొర్లారు.

ఒక రోజున పాంచజన్యం ఇంటికి పీతాంబరం వచ్చాడు

నొసలు చిట్లించి అయిష్టంగానే ఆహ్వానించాడు.

" ఇంకో పదిరోజుల్లో నీకు ఫిఫ్టీ ఇయర్స్ నిండబోతున్నాయిరా "

ఆశ్చర్యబోయాడు. " నీకేలా తెలుసు ? "

" నీ కన్నా ఇరవై ఐదు రోజులు పెద్దవాడ్ని కదా "

" ఐసీ........"

" మెడికల్ టెర్మినాలజీ ప్రకారం యాభైదాటితే ఓల్డేజ్ క్రిందే లెక్క "

" వయస్సులో ఏముంది అంతా మనస్సులోనే వుంది " నవ్వేడు.

" వయస్సు పడమటికి వాలేక అయినా పుణ్యకార్యాలు చెయ్యడం మంచి

లక్షణం "

మన ఊళ్ళో గుడి కడుతున్నాం, బడికి బిల్డింగు కడుతున్నాం, రక్షిత నీటి పథకం పెడుతున్నాం– అంటూ చందాలిమ్మని చాలా సార్లొచ్చాడు పీతాంబరం.

'దానధర్మాల వయస్సింకా రాలేదులే' అని తప్పించుకున్నాడప్పుడు. అది మనస్సులో పెట్టుకుని మాట్లాడుతున్నాడని భావించాడు పాంచజన్యం.

"బోల్డన్ని కుటుంబాలకు ఆధరువుని నేను. ఇంతకంటే పుణ్యకార్యం ఏవుంటుందీ. నా ఫిఫ్టియత్ బర్త్‌డేని గ్రాండ్‌గా చెయ్యాలని సినిమా నటుల్ని పిలిచి మరీ ప్రోగ్రాం ఇప్పిస్తున్నాను. దగ్గర దగ్గర పది లక్షలు ఖర్చు పెడుతున్నాను. నీ ఊహకి అందదులే ! "

అవాక్కై చూశాడు. కించిత్తు వేదనగా చూశాడు పీతాంబరం.

" న్యూస్‌ని డైజెస్ట్ చేసుకోవడం కష్టంలే. మనూళ్ళో నాలాగా ఉన్నత స్థితికి చేరుకున్న వాడు ఒక్కడూ లేడు. ఇక ముందూ వుండరని బల్ల గుద్ది చెప్పగలను......"

" సంతోషం. అందుకు కారకులెవరో తెలుసా ? "

" తెలుసు. ముగ్గురున్నారు. ఒకరు నేను. రెండు నేను. మూడు నేను "

" పొరబాటు. మనిషి జననం, జీవనం, జీవితం, చివరికి మరణం కూడా సామాజిక సంబంధాలతో ముడిపడినవేరా "

" అయితే ఏంటి ? " విసుగ్గా చూశాడు.

"ప్రతీ ఒక్కరూ మాతాపితృఋణం, ఋషి ఋణం, దేవ ఋణంతోబాటు మనుష్య ఋణం కూడా తీర్చుకోవాలి. నువ్వివాళ ఇలా వున్నావంటే అందుకు కారకులు ఎందరో వున్నారు..."

" కాదనట్లేదు. ఉద్యోగులున్నారు. పని వాళ్ళున్నారు. ఏజెంట్లున్నారు. వారందరికీ జీతాలూ కమీషన్లూ ఇస్తున్నాను తప్ప వాళ్ళని దోచుకోవడం లేదే " హేళనగా నవ్వేడు.

" వాళ్ళు తప్ప ఇంకెవరూ నీకు తోడ్పడటం లేదా ? ఆలోచించు. మనకోసం మనం ఎలాగూ కష్టపడతాం. అందులో విశేషమేమీ లేదు. పరోపకారార్థం ఇదం శరీరం అనుకుని బ్రతకటంలోనే జీవన ఉన్నతి వుంది. సార్థకత వుంది. మనిషి సంఘజీవి. సంఘాన్ని విస్మరిస్తే మనిషి ఉనికికే ప్రమాదం వస్తుంది "

" వేదాంతమా ?"

" నువ్వు తింటున్న అన్నం నువ్వు పండించింది కాదు. నువ్వు కడుతున్న బట్ట నువ్వు నేచింది కాదు. నువ్వు నడుపుతున్న కారు నువ్వు తయారు చేసింది కాదు. ఆఖరికి నువ్వు సుఖంగా వుంటోన్న ఈ ఇల్లు నిర్మించిందీ నువ్వు కాదు. మనిషి మనుగడకి పెళ్ళికి చావుకి అడుగడుగునా ఎందరి శ్రమో కావాలి. మరెందరి సహకారమో కావాలి. డబ్బిస్తున్నాననొచ్చు. అంతటితో ఆ మనుష్యఋణం తీరదు."

" మరెలా తీరుతుందిట ? చర్మం ఒలిచి చెప్పులు కుట్టివ్వాలా ? " వ్యంగ్యంగా అన్నాడు.

" అక్కర్లేదు. మరో పది మంది అన్నార్తులకి, అనాథలకి, అభాగ్యులకి సాయం చేస్తే చాలు. కనీసం ప్రతి పుట్టిన రోజునాడు సమాజానికి ఎంతో అంత తిరిగి ఇస్తే చాలు. నీ బర్త్‌డే మరపురానిది కావాలనుకుంటే మాత్రం ఒక్కసారి మై స్పెషల్ బర్త్‌డే వెబ్‌సైట్ క్లిక్ చెయ్యి. నువ్వు పెట్టాలనుకున్న ఖర్చులో వందో వంతు ఖర్చుపెట్టు. నువ్వు చెయ్యాలనుకున్నది చేసినందువల్ల లభించే సంతృప్తికి ఆనందానికి వందరెట్లు అధికంగా లభించకపోతే నన్నడుగు. పంచేంద్రియాలను తృప్తి పరిచే సుఖాలు శారీరకం. వ్యక్తిగతం. ఇతరులకు చేసిన సేవ, సాయం వల్ల కలిగే సంతృప్తి ఆనందం మానసికం. సామాజికం. వస్తాన్రా. నీ ఈ పుట్టినరోజు ప్రత్యేకమైనది కావాలని మనసారా ఆశిస్తున్నాను"

మెల్లగా నడచుకుంటూ వెళ్ళిపోయాడు పీతాంబరం.

అనేకానేక ఆలోచనలు మూకుమ్మడిగా దాడి చేసాయి. విభిన్న భావాలు ఘర్షణ పడుతున్నాయి.

శిలలా కూర్చునుండి పోయాడు పాంచజన్యం.

" ఇంకా అలాగే కూర్చునున్నారేం ? ఇవాళ కంపెనీకెళ్ళరా ? "

" వెళ్తున్నా ...."

లేచి అన్య మనస్కంగా వెళ్తోన్న భర్త వంక విడ్డూరంగా చూస్తుండి పోయింది మంజుల.

తనే డ్రైవ్ చేసుకుంటూ కంపెనీకెళ్తోంటే ఓ చోట తమ కారు కన్పించింది. అలర్టైపోయాడు. తమ కారే. సర్రున కారు తిప్పి అక్కడి కెళ్ళేడు.

కోపోద్రిక్తుడై "రంగా" అని అరిచాడు.

"బంటీ బబ్లీ ఏరా ఇడియట్ "

ఓ ప్రక్కకి చూపించాడు.

సిమెంటు బెంచీ మీద కూర్చునున్న ముసిల్దానికి బాక్సుల్లోంచి తీసి టిఫిన్ పెడుతున్నారు.

ఒళ్ళు తెలీని కోపం వచ్చేసింది. వాళ్ళ దగ్గరి కెళ్తూ "వాటీజ్ దిస్ నాన్సెన్స్" అరుస్తున్నట్టుగా అన్నాడు పాంచజన్యం.

" గంజి అవ్వ డాడ్ "

విసుగ్గా చిరాగ్గా కించిత్తు అసహ్యంగా చూశాడు.

" పదండి....." మొఖం వికృతంగా పెట్టుకుని అన్నాడు.

" అవ్వ రైల్వే స్టేషన్ కెళ్తుందిట. డ్రాప్ చేసి స్కూలు కెళ్తాం డాడ్. అవ్వకి లిఫ్ట్ ఇచ్చామంటే మా టీచర్ ఏమీ అనదు. మా హెల్పింగ్ నేచర్ని మెచ్చుకుంటుంది...."

" మీకెందుకీ అనవసరప్పెంట ? "

" గంజి అవ్వడాడీ..." గుర్తు పట్టలేదా అన్న భావం వుందా మాటల్లో.

నిజంగానే గుర్తించలేదతడు. " డ్రైవర్ డ్రాప్ చేస్తాళ్ళే. మీరు స్కూలు కెళ్ళండి "

" వుహూ. డ్రాప్ చేశాకే వెళ్తాం. రా అవ్వా....."

ముసలమ్మ చెరో రెక్కా పట్టుకుని కారు వైపు తీసుకెళ్తోంటే మిర్రి చూస్తుండి పోయాడు.

వెళ్తోన్నదల్లా ఆగి, " బంగారంలాంటి బిడ్డల్ని కన్నావు. భాగ్యశాలివయ్యా " కళ్ళతోనే దీవిస్తూ అందామె.

కుంటుతూ నడుస్తోన్న ఆమెని చూసేసరికి అయిదారేళ్ళ నాటి ఘటన మస్తిష్కంలో కదిలింది.

బంటీ బబ్లీ కార్లో స్కూలుకెళ్తోంటే దారిలో ఎవరో కారు వెనుక అద్దాన్ని రాయితో కొట్టారు. కారు ఆపి వాళ్ళ మీదకి పోట్లాటకి వెళ్ళాడు డ్రైవర్. ఇంతలో కొందరు దుండగులొచ్చి బంటీనీ బబ్లీనీ ఎత్తుకుపోయారు.

వార్త తెలిసి బెంబేలు పడ్డారు. పోలీసు సాయంతో ఊరంతా గాలించారు.

పది లక్షలిస్తే వదుల్తామని కిడ్నాపర్లు ఫోన్ చేశారు. ఎప్పుడు ఎక్కడ ఇవ్వాల్సిందీ మళ్ళీ ఫోన్ చేసి చెబుతామన్నారు. పోలీసులు వారించినా డబ్బివ్వడానికి తను రెడీ అయ్యాడు. కాని ఫోన్ రాలేదు.

తెల్లవారింది. పిల్లల జాడ తెలీలేదు. మంజుల పిచ్చిగా ఏడుస్తూ కూర్చుంది. పిల్లలంటే తామిద్దరికీ ప్రాణమే. వారే లేకపోతే ఇక తన సంపాదనెందుకు?

దు:ఖంతో సుళ్ళు తిరుగుతోంటే చీకట్లో కాంతిరేఖ మెరిసింది.

బంటీ ఫోన్‌చేసి తనెక్కడున్నదీ చెప్పేడు. ఒక్క ఉదుటున వెళ్ళి తీసుకొచ్చేశారు. క్షేమంగా ఉన్నందుకెంతో పొంగిపోయారు.

కిడ్నాపర్ల కన్ను కప్పి తప్పించుకుని ఒక గుడిసెలో దూరారట. అందులోని అవ్వ వారిని దుండగుల కంటబడకుండా రక్షించిందిట. ఆకలేస్తోందంటే గంజి అన్నం పెట్టిందిట.

కిడ్నాపర్లకు దొరికివుంటే కసితో, కక్షతో ఎంతగా రెచ్చి పోయేవారో ఊహించుకోలేక పోయారు.

పిల్లల్ని కాపాడినందుకు అవ్వకి డబ్బివ్వబోతే తీసుకోలేదు. 'ఇదో సాయమా!' అని నవ్వేసింది.

ఆ తర్వాత పిల్లల రక్షణకి ప్రత్యేక ఏర్పాటు చేశాడు.

అదంతా గుర్తురాగా నిట్టూర్చాడు పాంచజన్యం.

అదంతా ఎలా మరచిపోగలిగాడో ! అవునూ – అసలు పిల్లలు అవ్వని ఎలా గుర్తుపట్టారో !

' చిత్రమే ' అనుకుంటూ వెళ్ళి కారెక్కాడు.

'ప్రాణదాత కదా!' అన్న ఆలోచన వచ్చింది. ఎవరో పట్టుకుని ఎత్తి కుదేసినట్టు అదిరిపడ్డాడు.

మెదడులో ఏదో తెలీని అలజడి మరేదో మథన పురుడు పోసుకోసాగాయి.

* * *

" సార్. ఎవ్విరిథింగ్ అరేంజ్డ్. మీరు చెక్స్ మీద సంతకం పెట్టేస్తే ఎడ్వాన్సు లిచ్చేస్తాను...." ఉత్సాహంగా అన్నాడు పీఆర్వో.

" జస్ట్ వెయిట్... మళ్ళీ కాల్ చేస్తాన్లే..."

అయోమయంగా చూసి బుర్రగోక్కుంటూ నిష్క్రమించాడతడు.

ల్యాప్‌టాప్ ముందుకి లాక్కొని పీతాంబరం చెప్పిన సైట్‌లో కెళ్ళాడు పాంచజన్యం.

సహాయంకోసం ఆశగా ఎదురు చూస్తున్న వారి వివరాలున్నాయి. 250 రూపాయల నుంచి ఎంతైనా సాయం చెయ్యొచ్చనీ, దాతలే డైరెక్టుగా సాయం అందించొచ్చనీ పేర్కొన్నారు వెబ్‌సైట్ నిర్వాహకులు.

ఇంతలో ఫ్లాష్ న్యూస్ ప్రత్యక్షమయ్యింది స్క్రీన్ మీద.

'ఒక బ్రెయిన్ డెడ్ పేషంట్ కళ్ళు, లంగ్స్, కిడ్నీలు, హార్ట్‌వాల్వ్‌లు దానం చెయ్యడానికి వారి కుటుంబ సభ్యులు అంగీకరించారు. కళ్ళని ఇద్దరు అంధులకు అమర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. దాతలు ఆపరేషన్ ఖర్చు భరిస్తే, వారికి వెంటనే దృష్టి ప్రసాదించవచ్చు. కొన్ని గంటల వ్యవధే వుంది. దయచేసి దాతలు వెంటనే స్పందించాల్సిందిగా ప్రార్థిస్తున్నాం....'

మరొక్కక్షణం ఆలస్యం చెయ్యకుండా " గో ఎహెడ్ " అంటూ మెస్సేజ్ పంపించాడు.

వెంటనే అభినందన మెస్సేజ్ వచ్చింది. ఫలానా ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయిస్తామనీ డైరెక్టుగా ఆ ఆసుపత్రి వారికి సొమ్ము చెల్లించమనీ కోరారు.

పీఆర్వోని పిలిచి చెక్కు ఇచ్చి హాస్పిటల్‌కి తరిమాడు. అప్పటిగ్గాని అతడి ఉద్వేగం తగ్గలేదు. మనః సంద్రం శాంతించలేదు.

పాంచజన్యం తన పుట్టినరోజుని నిరాడంబరంగా జరుపుకున్నాడు. ఇంట్లోనే పూజ చేశాడు. అభినందనలు స్వీకరించాడు.

భార్యాబిడ్డల్తో కలిసి పండ్ల పాకెట్లతో ఆసుపత్రికెళ్ళాడు.

" మీ కోసమే వెయిట్ చేస్తున్నాం. చూపురాగానే మొదట మిమ్మల్నే చూస్తామంటున్నారు...." డాక్టర్ చెప్పేడు.

ఇబ్బందిగా చూశాడు. " నన్నెందుకు ఏ దేవుడి ఫొటోయో చూస్తే...."

" దేవుడెలా వుంటాడో వారికి తెలీదుగా ! "

పుట్టు గుడ్డివారని గుర్తొచ్చి కదిలిపోయాడు.

డాక్టర్ ఓ రూంలోకి దారి తీయగా అనుసరించారంతా.

కట్లు విప్పగానే ఇద్దరూ కళ్ళు తెరిచారు. పాంచజన్యాన్ని దేవుళ్ళా చూశారు. వారి కళ్ళనిండా అనంతమైన ఆనందం. అపురూపమైన కృతజ్ఞత !

పాంచజన్యం కళ్ళ నుండి ఆనందాశ్రువులు ధారకట్టాయి.

కొన్ని గంటల క్రితం కంపెనీ టర్నోవర్ ముప్పై రెండు కోట్లకు చేరుకుందని తెలిసింది. అప్పటికన్నా అధికంగా చెప్పలేనంత అధికంగా మహదానందపడ్డాడు.

బ్రహ్మానందమంటే ఏమిటో సంతృప్తికి పరాకాష్ఠ అంటే ఏమిటో అతడి అనుభవంలో కొచ్చింది ! తోటి మనుషుల ఋణం కొంతైనా తీరినట్లు అనుభూతి కలిగింది !

" అవర్ డాడ్ ఈజ్ గ్రేట్ " బంటీ బబ్లీ ఆనందోద్విగ్నులై అరచి తండ్రి చేతుల్ని ముద్దాడారు.

**(స్వాతి మాసపత్రిక మే 2011)**